నేడు గణేశ్‌గడ్డ వరకు పాదయాత్ర

పటాన్‌చెరు, ఏప్రిల్ 8: బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శరెడ్డి రామచంద్రాపురం నుంచి గణేశ్‌గడ్డ వరకు బుధవారం పాదయాత్ర నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఆదర్శరెడ్డిని నియమించడంతో గణేశ్ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేసేందుకు తన ఇంటి నుంచి పాదయాత్ర చేయనున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని గణేశ్ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆదర్శరెడ్డి నిర్వహించే పాదయాత్రలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీశ్‌రావు హాజరవుతారని నాయకులు తెలిపారు. పాదయాత్రలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో జన సమీకరణ చేసేందుకు గ్రామాల్లో ప్రచారం చేశారు. రామచంద్రాపురం, పటాన్‌చెరు, ముత్తంగి, ఇస్నాపూర్ గణేశ్‌గడ్డ వరకు పాదయాత్ర చేస్తున్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

గుమ్మడిదల, ఏప్రిల్ 8: పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో బీరంగూడ నుంచి పటాన్‌చెరు గణేశ్‌గడ్డ వరకు చేపట్టనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని గుమ్మడిదల మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ తరఫున నిర్వహించే పాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పాదయాత్రకు భారీగా తరలిరావాలి

రామచంద్రాపురం, ఏప్రిల్ 8: ఆర్సీపురం నుంచి గణేశ్‌గడ్డ ఆలయం వరకు బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేయనున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర జరగనుంది. ఆర్సీపురం డివిజన్‌లోని ఆదర్శ్‌రెడ్డి నివాసం నుంచి బుధవారం తెల్లవారుజామున బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి దంపతులు పాదయాత్ర మొదలుపెడుతారు. అక్కడి నుంచి ఇస్నాపూర్‌కు చేసుకొని అక్కడ అల్పాహారం చేసిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పాదయాత్రగా గణేశ్ గడ్డ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ సింధూఆదర్శ్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేస్తారు. పాదయాత్ర ముగింపులో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొంటారని ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులకు అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. పాదయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్, ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ గణేశ్‌గడ్డకు మొక్కులో భాగంగా స్వామివారి దర్శనం కోసం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేస్తున్నామన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంతోపాటు రాష్ట్ర ప్రజలు చల్లగా ఉండాలనే ఉద్దేశంతో దైవకార్యానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. పాదయాత్రకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఆర్డినెన్స్‌లో కొనసాగుతున్న నిరసనలు

కంది, ఏప్రిల్ 8: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు శాంతియుత నిరసనకు దిగారు. కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉద్యోగులందరూ డిమాండ్ బ్యాడ్జ్‌లు ధరించి నిరసన తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వరకు డీమ్డ్ డిప్యూటేషన్ కొనసాగించాలని, ప్రసార భారతి లాగా ఓఎఫ్‌బీని గుర్తించాలని, ఎంసీఎం, చార్జ్‌మెన్ పదోన్నతులు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అజయ్, జయవర్ధన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, బషీరుద్దీన్, దుర్గయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీనా సభ్యులు పంపిణీ చేసిన స్కూల్ షూతో విద్యార్థులు

విద్యార్థులకు స్కూల్ షూ పంపిణీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 8: తెల్లాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కూల్ షూల పంపిణీ చేశామని టీనా సభ్యులు కవితజాలే, ఆర్‌వీ రామమూర్తి, పి.రవిరమణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు టీనా సహకారం అందిస్తుందన్నారు. తెల్లాపూర్, ఇంద్రానగర్‌లో ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 590మంది విద్యార్థులకు స్కూల్ షూలు అందజేశామన్నారు. విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువచేసేందుకు గతంలో కంప్యూటర్లు అందించామని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు గణేశ్, ఏలెన్‌రాణి, రవళి తదితరులు ఉన్నారు.

మే 1 నుంచి సమ్మర్ క్యాంప్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 8: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మే 1వ తేదీ నుంచి 31వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి ఖాసీంబేగ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. శిబిరాలకు సంబంధించిన సామగ్రిని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అందించనున్నట్లు వెల్లడించారు. ఇన్‌చార్జిల నియామకం కోసం ఈనెల16 లోగా ఆన్‌లైన్ dysosangareddy@gmail.comలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 7981798957 నెంబరుపై సంప్రదించాలన్నారు.

సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష

కల్హేర్, ఏప్రిల్ 8: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో రమేశ్‌బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 80 మంది ఉపాధి కూలీలను పెంచాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, పారిశుధ్యం, నర్సరీల పెంపకంపై వివరాలు తెలుసుకున్నారు. ఎండల తీవ్రత వల్ల బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిపోయి తాగునీటి సమస్య నెలకొందని బోరు బావులను అద్దెకు తీసుకొని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో అదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఉపాధి ఈసీ వేణుమాధవ్ ఉన్నారు.

నాగులకట్టలో యువతి అదృశ్యం

జహీరాబాద్, ఏప్రిల్ 8: నాగులకట్ట ప్రాంతంలో నివాసముంటున్న యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. కర్ణాటకలోని నిర్ణ గ్రామానికి చెందిన హనుమంతరావు జహీరాబాద్‌లోని జేసీ బ్రదర్స్ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. గతనెల 29న ఆరోగ్యం బాగాలేకపోవడంతో అద్దెకు ఉంటున్న నాగులకట్ట ప్రాంతంలోని ఇంట్లోనే ఉన్నాడు. హనుమంత్‌రావు ఆరోగ్యం కుదుటపడడంతో ఈనెల 5న జేసీ బ్రదర్స్ బట్టణ దుకాణానికి పనికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సారికి తన కూతురు ప్రీతి(19) ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె కోసం పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి హనుమంత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీలులు పేర్కొన్నారు.

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 8: సన్న బియ్యంతో పేదలకు లబ్ధి చేకూరుతున్నదని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని 3వ వార్డులో మంగలి కిట్టు, స్వప్న కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. సన్న బియ్యం పంపిణీపై వారి అభిప్రాయాన్ని కలెక్టర్ తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. సన్న బియ్యంతో కడుపు నిండా అన్నం తింటున్నామని పేర్కొన్నారు. అనంతరం రేషన్ దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్ సన్న బియ్యంపై లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లాలో 846 రేషన్ దుకాణాలకు 3లక్షల 78వేల 728 రేషన్ కార్డుదారులకు జిల్లాలో సమర్థవంతంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.జిల్లాలో 7999 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామని, గతంలో దొడ్డు బియ్యం నాణ్యతగా లేనందున వేరే వారికి అమ్ముకునేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితికి ప్రభుత్వం చెక్‌పెడుతూ సన్న బియ్యం కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

దివ్యాంగులకు ప్రతినెలా మొదటి శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నందున జిల్లాలోని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈనెల మొదటి శనివారం 5న సెలవు రోజు ఉన్నందున మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్‌తో కలిసి దివ్యాంగుల అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. 23 దరఖాస్తులు ప్రత్యేక ప్రజావాణిలో అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్, రెన్యువల్ కోసం సంబంధిత దివ్యాంగులకు ఫోన్ చేసి సమాచరం అందించాలన్నారు. సదరం శిబిరంలో స్లాట్ బుకింగ్ కోసం మొబైల్ యాప్‌లో సిటిజన్ స్లాట్ బుకింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని చెప్పారు. నెలలో రెండుసార్లు సదరం స్లాట్ బుకింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ, డీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

యువత ఉపాధి కోసం డీట్

యువత ఉపాధి అవకాశాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆఫ్ తెలంగాణ'(డీట్) ప్రారంభించిందని కలెక్టర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీట్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ప్రైవేటు సంస్థల్లో నిరంతర ఉద్యోగాల కల్పన కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో కూడిన డీట్ అంతర్జాల వేదికను సీఎం ఈనెల 4న ప్రారంభించారని గుర్తు చేశారు. డీట్ రిజిస్ట్రేషన్‌లో భాగంగా ఉద్యోగార్థుల ప్రాథమిక సమాచారంతోపాటు విద్యార్హతలు, నైపుణ్యాలు తదితర మౌలిక సమాచారంతో తమ ప్రొఫైల్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తిచేసిన వివరాల ఆధారంగా వ్యక్తిగత రెజ్యూమ్ అందిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చదువుతున్న ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు కావాల్సిన ఇంటర్న్‌షిప్, చదువు పూర్తయిన విద్యార్థులకు కావాల్సిన అప్రెంటీస్‌ల సమాచారం కూడా అందిస్తుందన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వృద్ధాశ్రమం, బాల రక్షాభవన్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. వృద్ధులకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. వారికి కావాల్సిన సదుపాయాలను సమకూర్చాలని స్పష్టం చేశారు. కిచెన్, వాష్ ఏరియా, నడవడానికి వాకింగ్ ఏరియాకు కూడా స్థలాన్ని కేటాయించామన్నారు. అనంతరం బాలరక్షా భవన్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రతి గదిని పరిశీలించారు. తర్వాత రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేయనున్న జనరిక్ మందుల దుకాణం స్థలాన్ని, మహిళా పెట్రోల్ బంకు స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో లలితా కుమారి, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి వనజారెడ్డి, డీఈ దీపక్, డీసీపీవో రత్నం, ఎఫ్ఆర్వో సతీశ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కురుమ సంఘం సభ్యులు, పక్కన ఆదర్శ్‌రెడ్డి, సోమిరెడ్డి

బీరప్ప జాతరకు ఆహ్వానం

రామచంద్రాపురం, ఏప్రిల్ 8: తెల్లాపూర్‌లో ఈనెల14న జరగనున్న బీరప్ప జాతరకు రావాలని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావును బీఆర్ఎస్ నేతలు, కురుమసంఘం సభ్యులు కోరారు. బుధవారం బీఆర్ఎస్ నాయకుడు మల్లేపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో తెల్లాపూర్ కురుమసంఘం సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి బీరప్ప జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు హరీశ్‌రావుకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, శ్రీశైలం, రాజేందర్‌రెడ్డి, మల్లేశ్, భిక్షపతి, కురుమ సంఘం సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి నేషనల్ సెమినార్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 8: పబ్లిక్ పాలసీని రూపొందించడంలో సామాజిక శాస్త్రాల పాత్ర -బహుళ విభాగ దృక్పథం అనే అంశంపై ఈనెల 9,10 తేదీల్లో రెండు రోజులపాటు జాతీయ సెమినార్ నిర్వహిస్తామని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమినార్‌కు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లు హాజరై పబ్లిక్ పాలసీని రూపొందించడంలో సామాజిక శాస్త్రాల పాత్రపై చర్చిస్తారని తెలిపారు. సమావేశంలో సామాజిక విభాగాల అధిపతులు జోత్స్న, మల్లిక, జగదీశ్వర్, అనురాధ, అధ్యాపకులు ఉన్నారు.

సెంట్రల్ జైల్ తనిఖీ

కంది, ఏప్రిల్ 8: కందిలోని సెంట్రల్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని బెరక్లూ, గదులు, వంటశాలను పరిశీలించారు. జైలులో ఉన్న సదుపాయాలు, భోజనం తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడి సమయానికి బెయిల్, ములాఖత్ అందుతున్నాయా అని తెలుసుకున్నారు. కేసుల పరిష్కారానికి న్యాయవాదులు లేని వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకుంటే ఉచిత న్యాయ సేవలు పొందేందుకు న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. అనంతరం జైల్‌లో కూరగాయలను పరిశీలించారు. జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆందోళనతో దిగొచ్చిన అధికారులు

జహీరాబాద్, ఏప్రిల్ 8: వేతనాల కోసం మిషన్ భగీరథ కార్మికులు చేపట్టిన ఆందోళనతో సంబంధిత జిల్లా అధికారులు దిగొచ్చారు. మంగళవారం జిల్లా మిషన్ భగీరథ అధికారులు కార్మికులతో చర్చించారు. బుధవారం మిషన్ కార్మికులకు ఐదు నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లిస్తామని సంబంధిత జిల్లా అధికారులు హామీ ఇచ్చారు. దీంతో వారంరోజులుగా న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్ మండలాల్లోని 75 గ్రామాలకు నిలిచిపోయిన మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను ఎట్టకేలకు పునరుద్ధరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతోపాటు ఐడీకార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని సంబంధిత జిల్లా అధికారులు, కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు కార్మికులు తెలిపారు.

డంపింగ్ యార్డుతో ప్రకృతికి విఘాతం కలిగించొద్దు



గుమ్మడిదల మున్సిపాలిటీలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గ్రామస్తులు

గుమ్మడిదల,ఏప్రిల్8: ప్యారానగర్ డంపింగ్‌యార్డుతో ప్రకృతికి విఘాతం కలిగించొద్దని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ) ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన అనుమతులు ఉపసంహరించుకోవాలని గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రైతు, మహిళా జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 63వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదల మున్సిపాలిటీలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆ గ్రామానికి చెందిన ఆనంద్, సత్యనారాయణ,శంకర్‌రావు, ఏవీ. రమణ, సీతారామ్ పాల్గొన్నారు. వీరికి రైతు జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, చిమ్ముల నర్సింహారెడ్డి, అమ్మగారి సదానందరెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, లలిత, ఆంజనేయులు, రమణారెడ్డి, సంజీవరెడ్డి సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో ఆ గ్రామాలకు చెందిన రైతు, మహిళా జేఏసీ నాయకులు దీక్షలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్ యార్డు చెత్తతో ప్రకృతిని నాశనం చేయొద్దని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పంట పొలాలు, కూరగాయ పంటలు, పర్యావరణం, భూగర్భజలాలు డంపింగ్‌యార్డు వ్యర్థాల వల్ల కలుషితమై ప్రజాజీవనానికి విఘాతం కలిగిస్తామని సూచించారు. ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని రేవంత్‌రెడ్డి సర్కారు డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్, మన్నె రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్ రైతు వేదికలో ఫర్టిలైజర్ దుకాణదారులతో మాట్లాడుతున్న డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలి

రాయికోడ్, ఏప్రిల్ 8:గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేయాలని రాయికోడ్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని రైతు వేదికలో మండల ఫర్టిలైజర్స్ దుకాణాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ....ఫర్టిలైజర్ దుకాణదారులు ఎరువుల, విత్తనాల విక్రయించేందుకు లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు ఎరువుల, విత్తనాల వివరాలు తెలియచేయాలన్నారు. ఆయన వెంట ఏవో సారికారెడ్డి, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

కటౌట్ కూలి వ్యక్తికి తీవ్ర గాయాలు

కంది, ఏప్రిల్ 8: కంది జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన భారీ కటౌట్ కూలి వ్యక్తిపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం రాత్రి 11 గంటలకు ఒక్కసారిగా ఈదురు గాలులు రావడంతో కింగ్స్ దాబా-2 ఎదుట జాతీయ రహదారిపై ఓ పార్టీకి చెందిన కటౌట్ కూలి అటుగా వెళ్తున్న బైక్‌పై పడింది. ప్రమాదంలో కంది గ్రామానికి చెందిన బాల మురళీగౌడ్‌కు తీవ్ర గాయాలవడంతోపాటు అతడి చెవు సగం వరకు కట్ అయింది. ప్రస్తుతం అతడు ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారే తప్పా వాటికి సరైన సపోర్టు లేకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయంలో రహదారిపై వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, జాతీయ రహదారిపై ఇలాంటి కటౌట్లు పెట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు

జహీరాబాద్, ఏప్రిల్ 8: వ్యక్తి హత్య కేసును చిరాగ్‌పల్లి పోలీసులు ఛేదించారు. ఒక రోజు వ్యవధిలోనే హత్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం జహీరాబాద్ పట్టణ సర్కిల్ పరిధిలోని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో డీఎస్పీ రామోహ్మన్‌రెడ్డి వెల్లడించారు. మొగుడంపల్లి మండలం చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధనసిరి గ్రామానికి చెందిన ఖలీల్‌షా అనే యువకుడి తల్లిని అదే గ్రామానికి చెందిన అబ్బాస్ అలీ(25) అనే యువకుడి ప్రతిరోజూ తిట్టడంతోపాటు ఫోన్ చేసి వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయంలో ఖలీల్‌షా ప్రవర్తన మార్చుకోవాలని అబ్బాస్ అలీకి సూచించాడు. అయినా అబ్బాస్ అలీ తన ప్రవర్తన మార్చుకోకుండా అదేవిధంగా వ్యవహరించడంతో ఎలాగైనా హతమర్చాలని ఖలీల్‌షా నిర్ణయించుకున్నాడు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో ఈనెల 6న అబ్బాస్ అలీ తన స్నేహితులు షేక్ అక్బర్‌అలీ, హసన్‌అలీలి, బాబర్, టీల్లులతో కలిసి ఓ ఫాంహౌస్‌లో విందు ఏర్పాటు చేసుకున్నారని ఖలీల్‌షా తెలుసుకున్నాడు. వెంటనే ఖలీల్‌షా తన స్నేహితుడు మెహతాబ్ బిస్తీతో కలిసి స్కూటీలో ఫాంహౌస్ వద్దకు చేరుకున్నారు. వెంట తీసుకువచ్చిన కత్తులతో అబ్బాస్ అలీపై విచక్షణరహితంగా దాడి చేసి హతమార్చారు. అడ్డు వచ్చిన షేక్ అక్బర్ అలీపై బీరు బాటిళ్లతో దాడి చేసి పారిపోయారు. షేక్ అక్బర్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం క్రైం బ్రాంచ్ పోలీసులు గాలింపు చేపట్టగా, మంగళవారం ఉదయం జహీరాబాద్‌లోని మెహతాబ్ బిస్తీ ఇంట్లో ఉన్న ఖలీల్‌షా, మెహతాబ్ బిస్తీలను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఎయిర్‌గన్, కత్తులు, సెల్‌ఫోన్, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి జహీరాబాద్ కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఒక రోజు వ్యవధిలోనే చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, క్రై బ్రాంచ్ పోలీసులు ఓందేవ్, నర్సింహులు, అనంద్‌లను డీఎస్పీ అభినందించారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న జహీరాబాద్ డీఎస్పీ రామోహ్మన్‌రెడ్డి

శిబిరంలో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో జంగారెడ్డి

ఆడిట్‌కు ఎస్‌హెచ్‌జీ పుస్తకాలు సిద్ధంగా ఉంచాలి

సంగారెడ్డి, ఏప్రిల్ 8: గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జీ స్వయం సహాయక సంఘాల 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ చేయడానికి సీఆర్పీలు వచ్చే సమయానికి పుస్తకాలన్ని సిద్ధంగా ఉంచాలని అదనపు డీఆర్డీవో జంగారెడ్డి సూచించారు. శుక్రవారం సంగారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో సంగారెడ్డి, అందోల్ క్లస్టర్ల మండలాలకు సంబంధించిన స్వయం సహాయక సంఘాల 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అన్ని స్వయం సహాయక సంఘాల పుస్తకాలను మార్చి 31నాటికి పూర్తి చేసి సీఆర్పీలు వచ్చేసరికి ఆడిట్ కోసం సిద్ధంగా ఉంచాలని, వారికి సహకరించి ఆడిట్ పూర్తి చేయించుకోవాలని సీసీలకు వీవోఏలకు సూచ